సీనియర్ టీమే లక్ష్యం

నమస్తే తెలంగాణకు త్రిష ప్రత్యేక ఇంటర్వ్యూ

తండ్రి రామిరెడ్డితో త్రిష

భారత క్రికెట్‌లోకి ఓ నయా సంచలనం దూసుకొచ్చింది. అంచనాలు లేకుండా బరిలోకి దిగి అసమాన ప్రదర్శనతో అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నది. ప్రతిభకు హద్దులు లేవని చేతల్లో చూపిస్తూ తన సత్తా ఏంటో ప్రపంచానికి ఘనంగా చాటిచెప్పింది. తనను తక్కువ అంచనా వేసిన వారికి దిమ్మతిరిగే సమాధానం చెబుతూ దేశం దృష్టిని ఆకర్షించింది. మలేషియా వేదికగా తాజాగా ముగిసిన ప్రతిష్ఠాత్మక అండర్-19 టీ20 ప్రపంచకప్‌ను భారత్ రెండోసారి కైవసం చేసుకోవడంలో మన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష కీలకంగా వ్యవహరించింది. దూకుడైన బ్యాటింగ్‌కు తోడు ఉపయుక్తమైన బౌలింగ్‌తో ప్రత్యర్థుల భరతం పట్టింది. ప్రతీ మ్యాచ్‌పై తనదైన ముద్ర వేసిన త్రిష..'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. పసి ప్రాయం నుంచే మొదలైన తన క్రికెట్ ప్రస్థానంలో కలల సాకారానికి ఒక్కో అడుగు వేస్తున్నట్లు చెప్పిన త్రిష..భవిష్యత్ లక్ష్యాలను ఆవిష్కరించింది. భారత సీనియర్ జట్టులో చోటే లక్ష్యమంటున్న త్రిషతో మాటమంతి.

టీ20 ప్రపంచకప్ గెలువడంపై?

❖ ప్రతిష్ఠాత్మక అండర్-19 టీ20 ప్రపంచకప్ గెలువడం చాలా సంతోషంగా ఉంది. ఆదివారం జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను తక్కువ స్కోరుకే పరిమితం చేస్తూ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించాం. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై నాతో పాటు ఆయూశి, వైష్ణవిశర్మ చెలరేగడంతో సఫారీలు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. దీనికి తోడు మెగా టోర్నీలో ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోర్లకు కట్టడి చేయడం మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. అదే ఒరవడి ఫైనల్లోనూ కొనసాగించాం. నా వరకు ఈ ప్రపంచకప్ చాలా స్పెషల్. ఎందుకంటే రెండేండ్ల క్రితం ప్రపంచకప్ గెలిచిన జట్టులోనూ నేను ఉన్నాను. రెండు ప్రపంచకప్‌లు సొంతం చేసుకోవడం అరుదైన సందర్భం.

ఆల్‌రౌండ్ ప్రదర్శనపై?

❖ ప్రపంచకప్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టుకు బాగా లాభించింది. టీమ్‌కు అవసరమైన ప్రతీసారి నా పాత్రను చక్కగా నిర్వహించాను. మెగాటోర్నీకి ముందే ఎవరెవరు ఎలాంటి బాధ్యతలు తీసుకోవాలో నిర్ణయించారు. అందుకే తగ్గట్లు గత ప్రపంచకప్‌లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన నేను ..ఈసారి నాకు ఇష్టమైన ఓపెనర్ పొజిషన్‌లో వచ్చాను. అది నాకు ఒక రకంగా కలిసొచ్చింది. ప్రత్యర్థి బౌలర్లపై మొదటి నుంచే దూకుడు ప్రదర్శిస్తూ పరుగులు సాధించడం ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. బౌలింగ్ విషయానికొస్తే..స్కాట్లాండ్ మ్యాచ్‌తో పాటు ఫైనల్లో దక్షిణాఫ్రికాపై నా బౌలింగ్ బాగా పనికొచ్చింది. పిచ్‌పై అంచనాకు వస్తూ లెగ్‌స్పిన్‌తో వికెట్లు పడగొట్టాను. జట్టుకు అవసరమైన ప్రతీసారి నా పాత్రను చక్కగా నిర్వర్తించాను.

భవిష్యత్ లక్ష్యాలేంటి?

❖ ఊహ తెలియని వయసు నుంచే క్రికెట్‌లో ఒక్కో మెట్టు ఎదుగుతూ వస్తున్న నేను..భారత సీనియర్ మహిళల జట్టులో చోటే లక్ష్యంగా ముందుకెళుతున్నాను. అందుకోసం అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాను. అదీ ఎలాంటి టోర్నీ అయినా సత్తాచాటడమే పనిగా పెట్టుకున్నాను. తాజా ప్రపంచకప్, అంతకుముందు జరిగిన ఎమర్జింగ్ ఆసియాకప్‌లోనూ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచాను. ఇలా జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో నిలకడే గీటురాయి రాణిస్తున్నాను. టోర్నీకి టోర్నీకి అనుభవం కొద్ది ఆటతీరును మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగుతున్నాను. ఏనాటికైనా జాతీయ సీనియర్ జట్టు తరపున ఆడి దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నదే నా తపన. అందుకోసం ఎలాంటి అవరోధాలు ఎదురైనా వెరువకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తాను.

కుటుంబసభ్యుల ప్రోత్సాహం?

❖ ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉండటానికి నా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహమే. రెండేండ్ల వయసు నుంచే నాతో ఓనమాలు నేర్పించిన తండ్రి రామిరెడ్డి త్యాగం వెలకట్టలేనిది. నాకోసం ఆయన ఉద్యోగాన్ని వదులుకోవడంతో పాటు మెరుగైన శిక్షణ కోసం పొలం అమ్ముకుని హైదరాబాద్‌కు వచ్చాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు నా కెరీర్ ఎదుగుదలలో తండ్రి ప్రోత్సాహం మరువలేనిది. ఆయన శ్రమకు విలువ నిస్తూ కోచ్‌ల సహకారంతో నేను ఈ స్థాయికి చేరుకోగలిగాను. నేను మ్యాచ్‌లు ఎక్కడ ఆడినా..అక్కడికి వస్తూ ప్రోత్సహించడం వల్లే జాతీయ స్థాయికి ఎదగగలిగాను. ఆయనే నాకు సర్వస్వం. అందుకే ఆయన కష్టానికి గుర్తుగా ప్రపంచకప్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు అంకితమిచ్చాను.

టాటా చెస్ చాంపియన్ ప్రజ్ఞానంద

● టైబ్రేకర్‌లో గుకేశ్ ఓటమి



విజ్క్యాంజీ (నెదర్లాండ్స్): ప్రతిష్ఠాత్మక టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టైటిల్‌ను భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద గెలుచుకున్నాడు. 19 ఏండ్ల ఈ చెన్నై చిన్నోడు.. ఆదివారం రాత్రి ఉత్కంఠగా జరిగిన టైబ్రేకర్‌లో మరో యువ సంచలనం, ప్రపంచ నంబర్‌వన్ దొమ్మరాజు గుకేశ్‌పై 2-1తేడాతో నెగ్గి తొలిసారి ఈ టోర్నీలో విజేతగా నిలిచాడు. 13వ రౌండ్ తర్వాత గుకేశ్, ప్రజ్ఞానంద.. తలా 8.5 పాయింట్లతో నిలవడంతో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేకర్ నిర్వహించగా.. ఆ పోరులో ప్రజ్ఞానందనే గెలుపు వరించింది. తాజా విజయంతో ప్రజ్ఞానంద.. 2006 తర్వాత ఈ టోర్నీలో విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కాడు.

భారత్‌లో ఐపీబీఎల్

● ఆరు నగరాల్లో పోటీలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత బాక్సింగ్ అభిమానులకు శుభవార్త! ప్రముఖ బాక్సింగ్ లీగ్‌గా పేరొందిన అంథోనీ పెట్టిస్ ఫైటింగ్ చాంపియన్‌షిప్(ఏపీఎఫ్‌సీ)..భారత్‌కు చెందిన ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్(ఐపీబీఎల్) భారత్‌లో తొలిసారి బాక్సింగ్ పోటీలు నిర్వహించబోతున్నాయి. వచ్చే నెలలో దేశంలోని ఆరు ప్రధాన నగరాలు ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, ముంబై, గోవా, బెంగళూరు వేదికలుగా మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాయి. ఇందుకోసం యూఎఫ్‌సీ లైట్‌వెయిట్ మాజీ చాంపియన్ అంథోనీ పెట్టిస్ తొలిసారి భారత్‌కు రాబోతున్నాడు. డబ్ల్యూబీసీ ఇండియా చాంపియన్ సబరి జైశంకర్, సెర్గియో పెట్టిస్ మధ్య ప్రధాన పోరు జరుగుతుందని ఐపీబీఎల్ సోమవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే పలు ప్రపంచ బాక్సింగ్ కౌన్సిల్(డబ్ల్యూబీసీ) టైటిళ్లు సొంతం చేసుకున్న సబరి, సెర్గియో మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది.

'కంకషన్'పై ముదురుతున్న వివాదం

మ్యాచ్ రిఫరీ శ్రీనాథ్‌పై ఇంగ్లండ్ మాజీల అసహనం

ముంబై: భారత్, ఇంగ్లండ్ మధ్య ఇటీవల ముగిసిన నాలుగో టీ20లో శివమ్ దూబె స్థానంలో బౌలర్ హర్షిత్ రాణాను 'కంకషన్ సబ్‌స్టిట్యూట్'గా తీసుకోవడం వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై ఇంగ్లండ్ మాజీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో మ్యాచ్ రిఫరీ (జవగళ్ శ్రీనాథ్) భారత్‌కు అనుకూలంగా వ్యవహరించాడని మాజీ మ్యాచ్ రిఫరీ, ఇంగ్లండ్‌కు చెందిన క్రిస్ బ్రాడ్ స్పందించాడు. ఎక్స్ వేదికగా బ్రాడ్ స్పందిస్తూ.. 'ఇలాంటి పరిస్థితులను నివారించాలంటే మ్యాచ్‌లో ఏ దేశానికీ చెందినవారు కాకుండా స్వతంత్ర మ్యాచ్ రిఫరీలు ఉండాలి. ఐసీసీ ఎందుకు ఆ పాత పక్షపాత, అవినీతి రోజుల వైపు మళ్లుతోంది? పూణె మ్యాచ్‌లో భారత ఆటగాడిని భర్తీ చేసేందుకు ఒక భారత మ్యాచ్ రిఫరీని ఎలా అనుమతిస్తాడు?' అని రాసుకొచ్చాడు. ఈ వివాదం ముదురుతున్న నేపథ్యంలో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. 'పూణెలో దూబె హెల్మెట్‌కు బంతి బలంగా తాకినా మ్యాచ్ ముగిసేదాకా బాగానే బ్యాటింగ్ చేశాడు. అతడు కంకషన్ కాలేదు. అతడి స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌ను అనుమతించడం సరైంది కాదని అనిపిస్తోంది. ఒకవేళ వచ్చినా అతడు ఫీల్డింగ్ వరకే పరిమితమవ్వాలే తప్ప బౌలింగ్ చేయాల్సి ఉండకూడదు. ఇలాంటి చర్యల ద్వారా మ్యాచ్ గెలవాల్సిన అవసరం భారత్‌కు లేదు' అని ఘాటుగానే వ్యాఖ్యానించాడు.

ఈ వారంలోనే ఐపీఎల్ షెడ్యూల్!

ముంబై: పొట్టి క్రికెట్ పండుగ ఐపీఎల్ - 2025కు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఈ వారంలోనే విడుదలవనున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 6న ఇంగ్లండ్‌తో తొలి వన్డే ముగిసిన అనంతరం బీసీసీఐ.. ఐపీఎల్-18 షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశమున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. మార్చి 21న మొదలై మే 25న ముగియనున్న ఈ మెగా లీగ్‌లో 74 మ్యాచ్‌లున్నాయి.

సురభికి కాంస్యం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న 39వ జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో రెండో పతకం చేరింది. సోమవారం జరిగిన మహిళల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో రాష్ట్ర యువ షూటర్ రాపోలు సురభి భరద్వాజ్ కాంస్య పతకంతో మెరిసింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన పోరులో సురభి 448.8 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. సిఖ్ఖిరౌర్‌సమ్రా (461.2, పంజాబ్), అంజుమ్ మౌద్గిల్ (458.7, పంజాబ్) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల 3X3 బాస్కెట్‌బాల్ కేటగిరీలో తెలంగాణ ఫైనల్ చేరుకుని కనీసం రజతం ఖాయం చేసుకుంది. బీచ్ వాలీబాల్ పురుషుల, మహిళల విభాగాల్లో తెలంగాణ ముందంజ వేసింది.

నిమిషాల్లోనే ఉఫ్

హాటికేకుల్లా భారత్ Xపాక్ మ్యాచ్ టికెట్లు

దుబాయ్: దాయాదుల క్రికెట్ సమరానికి ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. మ్యాచ్ జరిగే రోజు ఉన్న పనులన్నీ పక్కనబెట్టి క్రికెట్ అభిమానులంతా టీవీలకు అతుక్కుపోతారు. ఇక ఈ పోరును నేరుగా స్టేడియంలో చూసి ఆనందించేవారి కోసం ఐసీసీ.. టికెట్లను ఆన్‌లైన్‌లో సోమవారం విక్రయానికి పెట్టింది. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఈనెల 23న దుబాయ్ ఆతిథ్యమివ్వనున్న భారత్, పాకిస్థాన్ మ్యాచ్ కోసం ఐసీసీ.. ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచిన టికెట్లు నిమిషాల్లోనే ముగిశాయి. 25వేల సీటింగ్ సామర్థ్యం ఉన్న దుబాయ్ స్పోర్ట్స్ సిటీ క్రికెట్ స్టేడియంలో టికెట్లను ఐసీసీ.. సోమవారం ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టగా వాటికోసం అభిమానులు ఎగబడ్డారు. సుమారు ఒక లక్షా 50 వేల మంది ఆన్‌లైన్‌లో టికెట్ల కోసం పోటీపడటంతో ఒక్కొక్కరి టికెట్ బుక్ అయ్యేందుకు కనీసం గంటన్నర నుంచి రెండు గంటల సమయం పట్టింది.

అత్యుత్తమ జట్టులో త్రిష

భారత్ నుంచి మరో ముగ్గురికి చోటు

కౌలాలంపూర్: రెండ్రోజుల క్రితం ముగిసిన అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించిన యువ భారత జట్టు.. ఐసీసీ ప్రకటించిన 'టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్'లోనూ సత్తా చాటింది. భారత్ ట్రోఫీ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ యువ ఆల్‌రౌండర్ గొంగడి త్రిషతో పాటు మరో ముగ్గురు ప్లేయర్లు జట్టులో చోటు సంపాదించారు. ఓపెనర్ కమిలిని, లెఫ్టార్మ్ స్పిన్నర్లు వైష్ణవి శర్మ, అయూషి శుక్లా సైతం ఫైనల్ లెవెన్‌లో ఉన్నారు. టోర్నీలో అత్యధిక పరుగులు (309) చేసిన త్రిష.. బౌలింగ్‌లోనూ రాణించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డును గెలిచింది. దక్షిణాఫ్రికాకు చెందిన కైలా రెనెకె.. జట్టుకు సారథిగా ఎంపికవగా ఇంగ్లండ్ నుంచి ఇద్దరు, శ్రీలంక నుంచి ఇద్దరు క్రికెటర్లు చోటు దక్కించుకున్నారు.

శాంసన్‌కు గాయం

ముంబై: టీమ్‌ఇండియా ఓపెనర్ సంజూ శాంసన్ గాయం బారిన పడ్డాడు. ఇంగ్లండ్‌తో వాంఖడే వేదికగా ముగిసిన ఆఖరి టీ20లో భాగంగా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఆర్చర్ వేసిన బంతి శాంసన్ కుడి చేతి చూపుడు వేలికి గాయమైంది. గాయం తీవ్రత దృష్ట్యా సంజూ కనీసం ఐదు నుంచి ఆరు వారాల పాటు ఆటకు దూరమవనున్నాడు. దీంతో అతడు తన స్వంత రాష్ట్రం కేరళ తరపున రంజీ క్వార్టర్స్ మ్యాచ్ ఆడే అవకాశం కోల్పోయాడు. ఐపీఎల్ ప్రారంభ సమయం వరకూ సంజూ.. ఎన్‌సీఏలో పునరావాసం పొందుతాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

షట్లర్లకు సన్నాహక శిబిరం

ఢిల్లీ: ఈనెల 11-16 మధ్య చైనాలోని కింగ్డావొ వేదికగా జరగాల్సి ఉన్న ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ బృందం కోసం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ప్రత్యేక సన్నాహక శిబిరాన్ని ఏర్పాటుచేసింది. మంగళవారం నుంచి గువహతిలో ప్రారంభం కాబోయే ఈ శిబిరంలో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ ద్వయం, ప్రణయ్‌తో కూడిన 14 మంది సభ్యుల బృందం పాల్గొననుంది. ఈ టోర్నీ 2023 ఎడిషన్‌లో భారత్ కాంస్య పతకం గెలిచింది.

శివాజ్ఞ పరిపాలకుడు

'కన్నప్ప' చిత్రంలో అగ్ర హీరో ప్రభాస్ పాత్ర ఫస్ట్‌లుక్ ఎలా ఉంటుందోనని ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి నిరీక్షణకు సోమవారం తెరపడింది. రుద్రుడిగా ఆయన ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'ప్రళయకాల రుద్రుడు..త్రికాల మార్గదర్శకుడు..శివాజ్ఞ పరిపాలకుడు..' అంటూ ఆయన పాత్రను పరిచయం చేశారు. రుద్రుడి వేషధారణలో ప్రభాస్ దైవత్వం మూర్తీభవించినట్లు కనిపిస్తున్నారు. విడుదల చేసిన కొద్దిగంటల్లోనే ఈ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో ప్రభాస్‌తో పాటు మోహన్‌లాల్, శరత్‌కుమార్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, బ్రహ్మానందం వంటి అగ్ర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ నెలాఖరున సెట్స్ పైకి..

స్టార్ రైటర్ స్థాయి నుంచి స్టార్ డైరెక్టర్ స్థాయికి ఎదిగిన త్రివిక్రమ్ శ్రీనివాస్.. 'పానిండియా డైరెక్టర్' ఇమేజ్ కోసం పోరాటం మొదలుపెట్టారు. ఆయుధంగా బన్నీ దొరికేశాడు. ఇక యుద్ధం చేయడమే తరువాయి. బేసిగ్గా రైటర్ కావడంతో పురాణాల్లోని వీరగాథలపై దృష్టి సారించాడు. దేవతల సేనాని, శివకుమారుడైన కార్తికేయుడిపై ఆయన కన్ను పడింది. అంతే.. కార్తికేయ పురాణం బేస్‌గా కథ తయారైంది. ప్రస్తుతం ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న వార్త ఇది. 300కోట్ల భారీ బడ్జెట్‌తో గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మించనున్నారట. జులాయి, సన్ ఆఫ్ సత్యమూర్తి, అలవైకుంఠపురములో చిత్రాలతో ఇప్పటికే హ్యాట్రిక్ కొట్టేశారు త్రివిక్రమ్, బన్నీ. వారిద్దరి కలయికలో రానున్న నాలుగవ సినిమా ఇది. ముఖ్యంగా పుష్పరాజ్ పానిండియా స్థాయి విరాట్ స్వరూపావిష్కరణ తర్వాత రానున్న సినిమా కావడంతో దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడటం సహజం. దానికి తగ్గట్టే ఊహలకు అతీతమైన గెటప్‌ను, సెటప్‌ను సిద్ధం చేసేశారట త్రివిక్రమ్. ముందు ఈ సినిమాను ఏప్రిల్‌లో మొదలుపెట్టాలని మేకర్స్ భావించినా.. తాజా సమాచారం ప్రకారం ఈ నెలాఖరునే షూటింగ్ మొదలు కానున్నట్టు తెలుస్తున్నది. ఇది బన్నీ అభిమానులకు నిజంగా శుభవార్తే. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తారట.

చిత్రం

ఇది కచ్చితంగా చెప్పాల్సిన కథ

ప్రస్తుతం ఉన్న టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్లలో బన్నీవాసు ఒకరు. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ వేదికగా ఆయన నిర్మించిన ఎన్నో చిత్రాలు ప్రేక్షకాదరణ చూరగొన్నాయి. ఆయన నిర్మాణ సారథ్యంలో రూపొందిన 'తండేల్' సినిమా ఈ నెల 7న థియేటర్లలోకి రానుంది. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి తెరకెక్కించిన ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు బన్నీవాసు.

● శ్రీకాకుళంలోని బెస్తవాళ్లు గుజరాత్ పోర్ట్‌కి ఫిషింగ్‌కి వెళ్తుంటారు. అక్కడ బోట్లు ఉన్న వాళ్లకి బిరుదులుంటాయి. మెయిన్ లీడర్‌ని తండేల్ అంటారు. అది గుజరాతీ పదం. తండేల్ అంటే నాయకుడు అని అర్థం. శ్రీకాకుళం జిల్లా మత్స్యలేశ్యం అనే గ్రామంలో జరిగిన సంఘటనల ఆధారంగా రైటర్ కార్తిక్ ఓ కథ రాసుకున్నారు. అందులోని ఎసెన్స్ నచ్చి, దర్శకుడు చందూ మొండేటిని ఆ కథ వినమన్నాను. తనక్కూడా నచ్చడంతో ఈ సంఘటనలపై రీసెర్చ్ మొదలు పెట్టాం. మత్సలేశ్యం వెళ్లి బాధితుల్ని కలిశాం. వారు చెప్పిన విషయాలు వింటే గూజ్‌బంప్స్ వచ్చాయి. కచ్చితంగా ఇది చెప్పాల్సిన కథ. జనరంజకంగా చెప్పాలంటే ఓ ప్రేమకథ కూడా అవసరం. అందుకే రాజు, సత్య అనే ఫిక్షనల్ క్యారెక్టర్లను దర్శకుడు చందు డిజైన్ చేశారు. ఆ పాత్రల ద్వారా కథ చెప్పడంతో సినిమాకు నిండుదనం వచ్చింది

● ఇది రూటెడ్ స్టోరీ. కల్మషంలేని ప్రేమకథ. అందుకే నేచురల్‌గా షూట్ చేశాం. ఇందులో తుపాను ఎపిసోడ్ తప్ప మిగతా సీన్లన్నీ ఒరిజినల్‌గా సముద్రంలోనే షూట్ చేశాం. షామ్ దత్ విజువల్స్ వండర్‌గా అనిపిస్తాయి. ప్రతి షాట్ ఒరిజినల్‌గా ఉంటుంది. ఓవైపు ఫిక్షనల్‌గా అల్లిన ప్రేమకథను చూపిస్తూ దాని ద్వారా వాస్తవ సంఘటనలను తెరపై ఆవిష్కరిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా చందూ ఈ సినిమాను మలిచారు. ప్రేమకథ ఎంతగా ఆకట్టుకుంటుందో.. వాస్తవ సంఘటనలు కూడా అంతగా కట్టిపడేస్తాయి. చందూ అంత మంచి స్క్రిప్ట్ రాశారు.

● చైతూకు వినగానే ఈ కథ బాగా నచ్చింది. 'మనం చేస్తున్నాం' అనేశారు. అయితే.. ఇది ఫిషర్‌మ్యాన్ క్యారెక్టర్. సముద్రంలోకి వెళ్లిన తర్వాత నెలల తరబడి స్నానం ఉండదు. మనం కూడా అంత రియలిస్టిక్‌గా చూపిస్తేనే బావుంటుందని, యాస కూడా డిఫరెంట్‌గా ఉంటుందని చెప్పాను. 'నేను వర్క్ చేస్తా..' అని కాన్ఫిడెంట్‌గా చెప్పారు. చెప్పిన మాట ప్రకారం ఆ పాత్రలో మౌల్డ్ అవ్వడానికి చైతూ చేసిన కృషి అసామాన్యం. సెట్‌లో చైతూ యాక్టింగ్ చూసి సాయిపల్లవి కూడా అభినందించింది. 'చైతూ నాకు గట్టి కాంపిటీషన్ ఇస్తున్నారు' అని చెప్పి, అందుకు తగ్గట్టు ధీటుగా నటించింది.

వినోదాలు పంచే 'సతీ లీలావతి'

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'సతీ లీలావతి' చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తాతినేని సత్య దర్శకుడు. నాగమోహన్‌బాబు ఎమ్, రాజేష్ టి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత హరీష్ పెద్ది క్లాప్‌నివ్వగా, వరుణ్‌తేజ్ కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించబోతున్నాం. చక్కటి కథతో కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అన్నారు. సోమవారం నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: బినేంద్ర మీనన్, సంగీతం: మిక్కీ జే మేయర్, నిర్మాణ సంస్థలు: దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్, సమర్పణ: ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, దర్శకత్వం: తాతినేని సత్య.

'కిరణ్ ర్యాంప్' ప్రారంభం

గత ఏడాది 'క' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు హీరో కిరణ్ అబ్బవరం. దాంతో ఆయన నెక్ట్స్ సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు కిరణ్ అబ్బవరం 11వ ప్రాజెక్ట్ అప్‌డేట్ వచ్చేసింది. సినిమా పేరు 'కె.ర్యాంప్'. జైన్స్ నాని దర్శకుడు. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో లాంఛనంగా మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి అగ్రనిర్మాత దిల్‌రాజు క్లాప్ ఇవ్వగా, మరో అగ్ర నిర్మాత అనిల్ సుంకర కెమెరా స్విచాన్ చేశారు. డైరెక్టర్స్ విజయ్ కనకమేడల, రామ్ అబ్బవరం, యదువంశీ, రైటర్ ప్రసన్న కలిసి స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. టైటిల్ లోగోలో కనిపిస్తున్న బొమ్మ, మందు సీసా, ఆ పుట్‌బాల్‌ని చూస్తుంటే.. ఇది మాస్ యాక్షన్ అడ్వంచర్ అని అవగతమవుతున్నది. యుక్తి తరేజా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నరేష్, వెన్నెల కిశోర్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్‌రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహనిర్మాతలు: బాలాజీ గుట్ట, ప్రభాకర్ బురుగు.

1950 మద్రాస్ నేపథ్యంలో..

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వేఫేరర్ ఫిల్మ్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. భాగ్యశ్రీ కథానాయికగా నటిస్తున్నది. సోమవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. '1950 మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రమిది. ఆనాటి మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులు, సంక్లిష్టతలకు అద్దం పడుతుంది. దుల్కర్ సల్మాన్ పాత్ర భిన్న కోణాల్లో సాగుతుంది' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: డాని శాంచెజ్ లోపెజ్, సంగీతం: జాను, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్.

చేనేత కార్మికుల జీవన చిత్రం

చేనేత కార్మికుల సమస్యలు, కష్టనష్టాలను చర్చిస్తూ రూపొందించిన చిత్రం 'ది అవార్డ్ 1996'. భూదాన్ పోచంపల్లికి చెందిన బడుగు విజయ్ కుమార్ దర్శకత్వం వహించారు. చిరంజీవి ధనుంజయ్ నిర్మాత. త్వరలో విడుదలకానుంది. సోమవారం ట్రైలర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఈ సినిమా ద్వారా చేనేత కార్మికుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చేనేత కార్మికుల జీవితానికి అద్దం పడుతుంది. త్వరలో ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తాం' అన్నారు. శివరామ్ రెడ్డి, సాయిచందన జంటగా నటించిన ఈ చిత్రానికి కెమెరా: లింగా గౌడ్, సంగీతం: ప్రశాంత్ మార్క్